ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023 5

శ్రీ సత్యసాయి



హిందూపురం వైసిపిలో కుమ్ములాట

ప్రజాశక్తి-హిందూపురం



స్టేషన్ వద్ద గుమికూడిన ఇరువర్గాలు

హిందూపురం వైసిపి నాయకుల మధ్య కుమ్ములాట మొదలైంది. హిందూపురం పట్టణంలో ఆదివారం జామీయ మసీదు కమిటీతో పాటు పట్టణంలోని వివిధ మసీదుల ముతవల్లీలు, ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి సంబంధించిన విడియోలు, ఫోటోలు కొంత మంది సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై ఎపి ఆగ్రోస్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ వర్గానికి చెందిన ఫజులూల్ రెహమాన్ హిందూపురం మత పెద్దలను బూతులు తిడుతూ సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. 'వారిని నడి రోడ్డు మీద నిలబెట్టి చెప్పులతో కొడితే గాని బుద్ధి రాదు, కులంలో కుల రాజకీయాలు ఎందుకు' అని బూతులు తిడుతు పోస్టు చేశారు. దీంతో ఆదివారం పెనుకొండ రోడ్డులో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా ఒక కూల్ డ్రింక్ షాప్ వద్ద ఉన్నా ఫజులూల్ రెహమాన్ వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ వర్గీయుల్లో కొంత మంది ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అలా ఎందుకు పోస్టు చేశావు' అని ప్రశ్నించారు. ఇది కాస్తా వివాదంగా మారి గొడవకు దారి తీసింది. దీంతో ఇరు వర్గాల వారు వారికి కావాల్సి వారు ఫోన్ చేసి అందరిని కలిపారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పెద్ద గొడవ జరిగే ప్రమాదముందని గ్రహించిన పోలీసులు ఇరు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. ఇది తెలిసిన వెంటనే మత పెద్దలతో పాటు ఇరు వర్గాలకు చెందిన నాయకులు, పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకున్నారు. పట్టణంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయాందోళన నెలకొంది. సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్సీ వర్గీయుల ర్యాలీ గురించి అనుచితంగా పోస్ట్ చేయడంతో మైనార్టీల మధ్య చిచ్చు నెలకొంది.

ఆహార సలహా సంఘాల జాడేదీ..?

గత ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను పేరుకు మాత్రమే ఏర్పాటు చేస్తే ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమంటూ అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం ఆహార సలహా సంఘాలనే కనుమరుగు చేసింది. దీంతో పౌరసరఫరా విభాగంలో అవినీతి, మార్కెట్‌లో కల్తీ విక్రయాలు,కనీస అనుమతులు లేకుండా హోటళ్లు రెస్టారెంట్లు వెలుస్తున్నారు. వీటిల్లో వారికి ఇష్టమొచ్చిన ధరలను నిర్ణయిస్తూ ప్రజల నుంచి అడ్డంగా దోచుకుంటున్నా అధికారుల్లో నుంచి కనీస స్పందన లేక పోవడం గమనార్హం.

పౌరసరఫరాల్లో పెరుగుతున్న అక్రమాలు
యథేచ్ఛగా కల్తీ విక్రయాలు
కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ సక్రమంగా అందించడంతో పాటు ఎక్కడా అక్రమాలు జరగరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయి. ఇవి ప్రతి నెల రేషన్ పంపిణీని పర్యవేక్షించాలి. అలాగే సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు చేయాల్సుంది. అయితే గత ప్రభుత్వం ఒక సారి సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా ముగించింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆహార సలహా సంఘాల సమావేశాలు ఏర్పాటు చేయలేదు. అసలు రెవెన్యూ అధికారులు ఈ సంఘాలను ఏర్పాటు చేశారా లేదా అన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. గత సంవత్సరం సంఘాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. దీంతో ఈ సంఘాలు కనుమరుగయ్యాయి. రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాటు మార్కెట్‌లో సరుకుల తూకాల్లో తేడాలు, హోటళ్లలో ఆహార పదార్థాల్లో కల్తీ మయం, చౌకధరల దుకాణాల్లో సక్రమంగా కార్డుదారులకు అందని బియ్యం ఇలా ఒకటేమిటి అనేక రూపాల్లో వినియోగదారులు మోసపోతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టేందుకు ఆహార సలహా సంఘాల దాడులు మచ్చుకైనా కనపడం లేదు. దీంతో ప్రజాపంపిణీ వ్యవస్థపై రోజు రోజుకూ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

ఆహార సలహా సంఘం పనితీరు ..

మండల ఆహార సలహా సంఘానికి ఛైర్మన్‌గా తహశీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపిపి, జెడ్‌పిటిసి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వినియోగదారుల సంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు ఉంటారు. ఆహార సలహా సంఘం ప్రతి మూడు నెలలకోకసారి సమావేశమై ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అయితే అధికారులు ఆహార సలహా సంఘాలను నిర్వీర్యం చేశారు.



రేషన్ సరుకుల్లో కోత...

గతంలో రేషన్ షాపుల్లో తెల్ల కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, కారంపొడి, అయిల్, ఉప్పు, చింత పండు, కిరోసిన్, చక్కెర తదితర వస్తువులు పంపిణీ చేసేవారు. 2019 అనంతరం ఏర్పడిన ప్రభుత్వం కార్డు దార్డు దారులకు కేవలం బియ్యం, అప్పుడప్పుడు చక్కెర, బేడలు మాత్రమే అందిస్తోంది. వీటిని కూడా ఈ పాస్ విధానంలోకి తీసుకురావడంతో అవి సక్రమంగా పనిచేయకుండా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందకుండా పోతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ పాస్ యంత్రాలలో కార్డుదారుల వేలిముద్రలు పడక పోవటంతో వారు కార్యాలయాలు చుట్టు ప్రదక్షిణలు చేస్తూనే వున్నారు. రేషన్ సరుకుల పంపిణీలో కార్డుదారుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాల్సిన ఆహార సలహా సంఘాల జాడ లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి అవి సక్రమంగా పని చేసే విధంగా చూడాల్సిన బాధ్యత ఉంది.

అధిక ధరలకు విక్రయాలు

పలువురు వ్యాపారులు నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి నాసిరకం సరుకులు అంటగడుతున్నారన్న ఆరోపణలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న సరుకులలో తరుగు ఉంటుందని రేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. వీటి నియంత్రణకు కృషి చేసే ఆహార సలహా సంఘాలు జిల్లాలో ఎక్కడా కానరావటం లేదు.

రేషన్ షాపుల్లో చేతివాటం

పట్టణం, మండల వ్యాప్తంగా కొన్ని రేషన్ షాపుల డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రభుత్వం ప్రతినెలా బియ్యం అప్పుడప్పుడు చక్కెర, బేడలు మాత్రమే కార్డుదారులకు అందిస్తుంటే డీలర్లు వ్యాపారులతో కుమ్మక్కై వీటికి తోడు అదనంగా మరికొన్ని సరుకులు అంటగడుతున్నారు. అవి కూడా మార్కెట్ రేట్ ప్రకారమే అందిస్తుండడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. కొందరు పేదలు బియ్యం తీసుకోవాలంటే మిగతా వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది డీలర్లు డబ్బాలతో తూకం వేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో తాజాగా సంచులపై సంచులు పెట్టి వేస్తుండటంతో ఒక తూకానికి కేజి నుంచి రెండు కేజిల వరకు తక్కువగా వస్తున్నాయని కార్డుదారులు వాపోతున్నారు. వీటిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం చేపట్టలేదని విమర్శిస్తున్నారు.

వ్యవస్థ సక్రమంగా లేదు



ప్రతి మూడు నెలలకొకసారి ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించడం వలన రేషన్ పంపిణీ వ్యవస్థలో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. కార్డుదారునికి సరుకులు సక్రమంగా అందుతాయి. రెవెన్యూ అధికారులు నెలవారి రేషన్ దుకాణాల తనిఖీలు, నెలవారి సమావేశాల నిర్వహణ లేనందున వ్యవస్థ అదుపుతప్పింది.

ఇంతియాజ్,
సిపిఎం జిల్లా కార్యదర్శి

సమావేశం నిర్వహిస్తాం



మండల స్థాయి ఆహార సలహ కమిటీని ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపాము. అయితే ఆసంఘాలను ఎంపిక చేస్తు ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే సమావేశాలను ఏర్పాటు చేస్తాం. అధికధరలతో పాటుకల్తీ ఆహారం, హోటళ్లు,ఇతర ఆహార సమస్యలపై చర్చించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రసాద్
ఇన్‌ఛార్జి తహశీల్దార్



ర్యాలీలో పాల్గొన్న మహిళలు, నాయకులు

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి మడకశిర రూరల్

రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా ఐద్వా ఆధ్వర్యంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య అధ్యక్షతన మడకశిరలో నిరసన ర్యాలీ, మానవహారం కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిల్షాద్ మాట్లాడుతూ 45 రోజుల నుండి రెజ్లర్లు, క్రీడాకారులు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అయితే మహిళా క్రీడాకారుల సమస్యను వినడానికి కూడా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని ఇనుమడింపజేస్తూ పతకాలు తెచ్చిన క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడి అవమాన పరచి దేశ గౌరవానికి మచ్చ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ పడావో బేటీ బచావో అనే నినాదం మాటలకే తప్ప చేతలకు కాదని నిరూపించారన్నారు. దేశంలో ఉన్న సెలెబ్రిటీల పరిస్థితే ఈ రకంగా ఉంటే సామాన్య మహిళల పరిస్థితులు ఏ రకంగా ఉంటుందో అన్నది ఈ సంఘటన బట్టి అర్థమవుతుందని అన్నారు. మహిళలు బహిరంగంగా తమపై వేధింపులకు పాల్పడ్డారని అన్ని ఆధారాలతో చెప్పుకున్నా కనీస చర్యలు కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకోకపోవడం చూస్తుంటే మహిళల పట్ల వారికి ఉన్న గౌరవం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. దేశ నలుమూలలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా రెజ్లర్ల పోరాటానికి మద్దతు పెరుగుతోందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రెజ్లర్లకు న్యాయం చేయాలని లేని పక్షంలో రాబోవు కాలంలో ఈ దేశ మహిళలు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మహిళలు , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఇంతియాజ్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య , కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు రమణా నాయక్ , సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు రామాంజనేయులు, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలుచేయాలి

ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేతరంగానికి సంబందించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలుచేయాలని ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో చేనేత కార్మికసంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామాంజినేయులు మాట్లాడుతూ ప్రసిద్ధి గాంచిన చేనేత రంగం నేడు పాలకులు అధికారుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. చేనేత 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని సక్రమంగా అమలుజరపకుండా ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు చేనేత కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. చేనేతకు రూ.200 కోట్లు మాత్రమే బడ్జెట్ కేటాయించారని, అది నేతన్ననేస్తం, ఉద్యోగులకు జీతభత్యాలకే సరిపోతుందని అన్నారు. చేనేతకు రూ.1000 కోట్లు ప్రతిఏడాది బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేతపై జిఎస్‌టి రద్దుచేయాలని, నేతన్ననేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికుడికి వర్తింపచేయాలని, ముడిసరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. చేనేతల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఈ ధర్నాకు జిల్లాలోని ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో చేనేత కార్మికసంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ, జాతీయ ఐక్యవేదిక వర్కింగ్ ప్రసిడెంట్ చట్టారవివర్ధన్, చేనేత సంఘం నాయకులు రవికుమార్, రమణ, వెంకటస్వామి, అన్నం సూరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కరుణసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారునికి, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాల జరగకుండా నివారణ చర్యలు చేపడతామని హిందూపురం రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఆదివారం మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని గతంలో పుట్టపర్తిలో ఏర్పాటు చేశాం.కానీ కొన్ని అనివార్య కారణాల వలన హిందూపురంలోనే కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం వాహన లైసెన్సులు పొందవలసిన వారు హిందూపురం నుండి పొందుతున్నారు. వాహనదారులు ఎక్కువగా ఉన్న కారణంగా హిందూపురం నుండే కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం.

ప్ర: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి, కాలం చెల్లిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలో ఆటో రిక్షాలు, గూడ్స్ వాహనాల పాటు ఇతర వాహనాలు మొత్తం 2,77,235 వాహనాలు ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయలేకపోవటంతో హిందూపురం నుండి కార్యకలాపాలు సాగిస్తున్నాం. వాహన లైసెన్సులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు తదితర ఆన్లైన్ కార్యకలాపాలు ప్రస్తుతం హిందూపురం నుండి కొనసాగిస్తున్నాం. ఇక్కడినుండే అన్ని చెల్లింపులు జరుగుతున్నాయి.



ప్ర : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు, వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటున్నాం. లైసెన్సు లేనివారు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, భారీ వాహనాలు నడపకుండా చర్యలు చేపడుతున్నాం. అలాంటి వారిని ట్రాన్స్‌పోర్టు అధికారులు గుర్తించి వారికి అవగాహన కల్పించి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సు మంజూరు చేయడానికి మేళాలు ఏర్పాటు చేసి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్సులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : బడి బస్సుల కండీషన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : పాత బస్సులను, కాలం చెల్లిన బస్సులను నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నాం. అలాంటి బస్సులను లైసెన్స్, పరిమితులు పునరుద్ధరణకు వచ్చినప్పుడు వాటినిపరిశీలించి కండిషన్ సరిగా లేని వాటిని తిరిగి పంపుతున్నాం. వాటి పనితీరును పరిశీలించి పర్మిట్లు మంజూరు చేస్తున్నాం.



రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణసాగర్‌రెడ్డి

నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల వారైనా బస్సులు నడిపితే వారిపై కేసులు పెడతాం. అలాంటి బస్సులను సీజ్ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీ సత్య సాయి జిల్లాలో కాలం చెల్లిన బడి బస్సులకు అనుమతులు మంజూరు చేయం.

రైతులను నిలువునా ముంచిన ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి రొద్దం :

రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం రాష్ట్రప్రజలను నిలువునా ముంచిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి విమర్శించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పెద్దగువ్వల పల్లిలో టిడిపి ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలకరి దుక్కులు చేపట్టే కార్యక్రమంలో భాగంగా పార్థసారధి పొలంలో నాగలిపట్టి దుక్కి దున్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం పార్థసారధి స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతాంగానికి కష్టాలు మొదలయ్యాయని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో రైతులకు డ్రిప్, స్పింక్లర్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టిడిపి హాయంలోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, నియోజకవర్గ నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, అశ్వర్థనారాయణ, వెంకటరామిరెడ్డి, సర్పంచి నాగరాజు, మంజు, అది, నాగేంద్ర, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : నాలుగేళ్ల జగన్ పాలనలో అన్నదాతలు అప్పులపాలయ్యారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలం మాదాపురం గ్రామంలో దుక్కిదున్ని ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయం మరింత భారంగా మారిందన్నారు. రైతులకు ఎందులోనూ ప్రోత్సాహకాలు అందించలేదన్నారు. ఈ రాష్ట్రంలో వ్యవసాయశాఖ మంత్రి ఎవరో.. మిగిలిన ఏ శాఖలకు ఏ మంత్రి ఉన్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉందన్నారు. అధికారులు, ఆర్బీకే సిబ్బంది పొలాల వైపు చూడటం లేదన్నారు.





ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి, మాజీ మంత్రి పరిటాల సునీత

ఇక్బాల్‌కు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు మద్దతుగా వందలాది మంది ముస్లింము మైనార్టీలు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వాల్మికీ లోకేష్‌తో పాటు ఇక్బాల్ మద్దతుదారులు ఆదివారం "జయహో ఇక్బాల్.. జయహెూ జగన్" అంటూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక అల్ హిలాల్ పాఠశాల ఆవరణం నుంచి సద్భావన్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, గాంధీ సర్కిల్ మీదుగా తిరిగి అల్ హిలాల్ పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ఇక్బాల్‌కు మద్దతుగా అంబేద్కర్ సర్కిల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ కుల మతాలకు అతీతంగా అందరికీ తోడుగా ఉన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో నియోజక వర్గంలో 3 మండలాల్లో 3 ఎంపిపిలు, 3 జడ్పిటిసిలను గెలిపించి క్లీన్ స్వీప్ చేశారన్నారు. దీంతో పాటు పురపాలక సంఘంలో 30 మంది కౌన్సిలర్లను, నియోజకవర్గంలో 30 స్థానాలను సర్పంచిలను గెలిపించారన్నారు. అయితే అధిష్టానం ఇక్బాల్‌కు కాకుండా వేరొకరిని తెరపైకి తీసుకురావాడం తగదన్నారు. ఇక్బాల్‌కు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జామీయ మసీదు కమిటీతో పాటు వివిధ మసీదుల ముతవల్లీలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఇక్బాల్ మద్దతుదారులు



రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోషియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపిక

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హాకీ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బంధనాథం సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపికైన క్రీడాకారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు ఒడిస్సాలో జరిగే 13వ జాతీయ జూనియర్ మెన్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర స్థాయి జట్టుకు ప్రశాంత్, వెంకటేశ్‌నాయక్, లోకేశ్, మహమ్మద్ రఫీ ఎంపికయ్యారన్నారు. వీరు ఆ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులకు సోమవారం కాకినాడలో శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

బదిలీ కమిషనర్‌కు సన్మానం

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆదివారం ఆయనను 25వ వార్డు సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్‌తో పాటు సచివాలయ సిబ్బంది సాయిప్రకాశ్, మురళిగిరి, నరేంద్రబాబు, సరిత, శిరీష, కాత్యాయని, పుష్పరాజు కమిషనర్ మల్లికార్జునను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. మల్లికార్జున మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేశారని కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది కొనియాడారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రొద్దం: మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ గోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ఓబీసీ-1, ఎస్సీ-2 ఎస్టీ-1 సీట్లు, 7వ తరగతిలో ఓబిసి-1, బీసీఏ-1, బిసిబి-3, బిసిడి-1, ఎస్సీ-1, ఎస్టీ-1, 8వ తరగతిలో బీసీబి-2, బిసిడి-1, ఎస్సీ-1, 9వ తరగతిలో బిసిబి-2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండల పరిధిలోని ఎల్లప్పకుంటలో వెలిసిన ఉబ్బదేవర గంగమ్మ గుడికి వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శ డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆదివారం రూ. 15,000 అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకట రమణ, వైసీపీ కదిరి పట్టణ అధ్యక్షుడు బహావుద్దీన్, వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, రజక సంఘం నాయకులు నారాయణ, రామయ్య, సుబ్రహ్మణ్యం, పోతులయ్య, రాము, లింగమయ్య, అంజి, వీరాంజి, కేశవ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నల్లచెరువు: నల్లచెరువులో పీర్లచావిడి శిథిలావస్థకు చేరుకొంది. ఈ విషయాన్ని నల్లచెరువు ప్రాంతానికి చెందిన బెంగళూరులో ఉంటూ స్థిరాస్తి వ్యాపారం చేసే పాల్యం సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన చావిడి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాడు.

రాగుల సాగుపై అవగాహన

రొళ్ల : ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు మండల పరిధిలోని దొడ్డేరి, రత్నగిరి, కాకి, బొమ్మగూడనల్లి, హుల్లికుంట, వట్టేబెట్ట, రొళ్ల, మల్లినమడుగు, ఎం.రాయపురం, గుడ్డగురికి రైతు భరోసా కేంద్రాల్లో రాగుల పంట సాగు విస్తీర్ణం పెంపుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఓ రాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆ సదస్సుల్లో ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే రాగుల విత్తనం, కొనుగోలు, తదితర వాటిపై రైతులకి వివరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కల్లుమర్రిలో వైద్య శిబిరం

మడకశిర: మండల పరిధిలోని కల్లుమర్రిలో ఆదివారం సర్పంచి గంగమ్మ నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మడకశిర పట్టణానికి చెందిన సుధాకర్ కడప నగరంలో హిమాలయ హాస్పిటల్ నడుపుతున్నారు. ఆ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా పలువురు పరీక్షలు చేయించుకున్నారు.

పలువురికి 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని రాచువారిపల్లి, కోనాపురం, పెడబల్లి గ్రామాల్లో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పలువురిని పరామర్శించారు. రాచువారిపల్లిలో మాజీ సర్పంచి కేశవ భార్య స్వప్న ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని గ్రామానికి తిరిగి వచ్చింది. ఆమెను పల్లె పరామర్శించి యోగ క్షేమాల తెలుసుకున్నారు. అదే గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్‌కుమార్ తండ్రిని పరామర్శించారు. అనంతరం కోనాపురం గ్రామంలో రంగారెడ్డి కుటుం బం ఇచ్చిన విందుకు హాజరయ్యారు. పెడబల్లిలో నాయకులు, కార్యకర్తల యోగ క్షేమా లు తెలుసుకున్నారు. పల్లె వెంట నాయకులు శ్రీరామిరెడ్డి, గూడూరు ఓబులేసు, యోగానందరెడ్డి, లింగన్న, కేశవ, వెంకటప్ప, జగదీష్, భాస్కర్, వెంకటరాముడు, అమర్నాథ్, తదితరులు ఉన్నారు.



గుండె శస్త్రచికిత్స చేయించుకున్న స్వప్నను పరామర్శిస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

జగన్ పాలనలో వ్యవసాయం నిర్వీర్యం

టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం నిర్వీర్యమైందని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని రామాపురం వద్ద ఆయన రైతులు, మహిళలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ విధానాలతో రైతులకు వ్యవసాయం భారంగా మారిందన్నారు. కావున టిడిపిని గెలిపించుకుంటేనే రైతాంగం కష్టాలు తీరుతాయన్నారు. గతంలో రైతులు పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ క్రమం తప్పకుండా వచ్చేదన్నారు. నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. రైతులను కష్టాల నుంచి గట్టెక్కించడానికి చంద్రబాబు రైతులకు అనుకూలంగా మేనిఫెస్టోని తీసుకొచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసనాయుడు, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, తదితరులు రైతుల కష్టాలు, చంద్రన్న పాలనలో రైతులకు చేకూరిన లబ్ధిని వివరించారు.

ఏరువాక పౌర్ణమిన వ్యవసాయ పనులకు శ్రీకారం

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వ్యవసాయ పంటలకు ఏరువాక పౌర్ణమి రోజు శ్రీకారం చుడితే లాభసాటిగా ఉంటుందని ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రామాపురం వద్ద చలపతికి చెందిన వ్యవసా య క్షేత్రంలో ఆదివారం ఆయన ఏరువాక పౌర్ణమి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వ్యవసాయ సేద్యపు పరికరాలకు భూమిపూజ చేశారు. అనంతరం నాగలి పట్టి వ్యవసాయ పనులను ప్రారంభించారు. అంతకుముందు షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, సుబ్బరాయుడు, తెలుగు యువత నాయకులు, సర్పంచి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న శ్రీరామ్

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటామని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం రాయుడు అధ్యక్షతన జిల్లా మాదిగ ఉద్యోగులతో సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా హాజరైన బిక్షాలు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడుతూ మిషన్-50 డేస్ కార్యక్రమంలో భాగంగా నాయకులంతా గ్రామాలకు వెళ్లి మాదిగల్లో చైతన్యం తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇంకో వైపు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆగస్టులో హైదరాబాద్‌లో ఉమ్మడి రాష్ట్రాల మాదిగలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, ఆ సభకు కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆ సభ ద్వారా మాదిగల ఆకాంక్షను తెలుపుతామన్నారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా సీనియర్ నాయకులు బేకరీ గంగాధర్, పైపల్లి నరసింహులు, మాతంగి తిప్పన్న, ఎస్‌టిడి నరసింహులు, ఫొటో సాయి, ఎంఈఎఫ్ నాయకులు రవిశంకర్, నాగభూషణ, అశోక్, నాగరాజు, శివకుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవరపల్లి బిక్షాలు

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకోవాలని అనంతపురం మున్సిపల్ కమిషనర్ గుర్రం రమణారెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి సూచించారు. గుర్రం విజయభాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో 15 రోజులుగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం లింగారెడ్డి పల్లి, వెంకటగారిపల్లి గ్రామాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. విజేతలకు ట్రోఫీ, నగదు అందజేయడానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. క్రీడాకారుల మధ్య ఐక్యత, స్నేహభావం నెలకొనాలని, పోటీల్లో గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లింగారెడ్డిపల్లి జట్టు 10 ఓవర్లలో 85 పరుగులు చేయగా వెంకటగారిపల్లి జట్టు 61 పరుగులకే ఆలౌట్ అయింది. విజేతగా నిలిచిన లింగారెడ్డి పల్లి జట్టుకు ముఖ్య అతిథులు రూ. 10వేలు నగదుతో పాటు ట్రోఫీని, రన్నర్స్ జట్టుకు రూ. 5 వేలు, ట్రోఫీని అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్(లింగారెడ్డిపల్లి) దక్కించుకున్న పవన్‌కు రూ. 2,500, బెస్ట్ బ్యాట్స్‌మెన్(వెంకటగారిపల్లి) వలికి రూ. 2.500 అందజేశారు. కార్యక్రమంలో గుర్రం నరసింహారెడ్డి, శిరీష, పద్మీ, వడ్డే రామాంజనేయులు, ఈశ్వరయ్య, నారాయణ స్వామి, లోక్‌నాథ్‌రెడ్డి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి

టిడిపి మేనిఫెస్టోతో వైసీపీలో వణుకు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో వైసిపిం వణుకు పట్టుకుందని పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణంలోని 27, 34 వార్డుల్లోని వైఎస్ఆర్ కాలనీ, రాజేంద్రనగర్ ప్రాంతాలకు చెందిన సెక్షన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కావున ప్రతి గడపకూ వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో టిడిపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగూర్‌హుస్సేన్, సుధాకర్, బీబీ, కొత్తపేట ఆది, కేశగాళ్ల శీన, అత్తర్ రహీంబాషా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం గౌడ్

'పరిటాల రవీంద్ర' క్రికెట్ టోర్నీ విజేత పేరూరు

రామగిరి: పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రాప్తాడు క్రికెట్ లీగ్ టోర్నమెంట్ విజేతగా పేరూరు జట్టు నిలిచింది. స్థానిక పరిటాల రవీంద్ర స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైన ల్ మ్యాచ్‌లో రామగిరి లెవెన్ జట్టు, పేరూరు హిట్టర్ జట్టు తలపడగా పేరూరు విజయం సాధించింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు, వీక్షకులకు ప్రతిరోజూ భోజనం, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారన్నారు. విజేత జట్టుకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఆర్గనైజర్ శ్రీధర్‌నాయుడును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మ, దాదు, గుర్రం శీన, విశ్వనాథ్, మనోహర్, ఆంజనేయులు, అక్కులప్ప, రఘురాములు, కుమార్‌నాయక్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

నేడు అన్ని సచివాలయాల్లో స్పందన

బత్తలపల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహశీల్దార్ యుగేశ్వరీదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి అధికారులందరూ హాజరవ్వాలని సూచించారు. ప్రజలు సమస్యలపై వినతి పత్రాలు అందజేయవచ్చు అన్నారు.

ఎమ్మెల్యేని విమర్శించే అర్హత 'నిమ్మల'కు లేదు

గోరంట్ల రూరల్ : ఎమ్మెల్యే శంకరనారాయణను విమర్శించే అర్హత నిమ్మల కిష్టప్పకు లేదని వైసిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం వారు పత్రికా సమావేశం లో మాట్లాడారు. నీకు దమ్ముంటే ఎమ్మెల్యే పైన కాదు వైసిపి నాయకులు, కార్యకర్తలపై చేయి వేసి చూడు అని సవాల్ విసిరారు. నిమ్మల అవినీతి అక్రమాలు, రాసలీలలు ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు దందాలు, ఇసుక మాఫియా, మద్యం వ్యాపారం, వెలుగు కార్యాలయంలో అవినీతి, అక్రమాలు, తదితర అసాంఘిక కార్యక్రమాలపై చర్చకు సిద్ధమా అని విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసింహప్ప, ఎడిసిసి బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్‌రెడ్డి, గోరంట్ల సర్పంచి సరోజానాగేనాయక్, ఉపసర్పంచి రాజారెడ్డి, డాక్టర్ బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పేదల సేవే 'యువర్స్ ఫౌండేషన్' లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేదలకు సేవలందించడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యమని అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలుకు చెందిన చక్ర ఆసుపత్రి యాజమాన్యం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి చూపు మందగించిన వారికి వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి 34 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం డాక్టర్లు కళ్ల సం రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంప్ ఛైర్మన్ విజయ, సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, శింగనమల ప్రసాద్, శీలా నాగేంద్ర, బండి నాగేంద్ర, కుమార్ స్వామి, ఖలీల్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణులు

సమాజ శ్రేయస్సు కోసమే పౌర్ణమి గరుడ సేవ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సమాజ శ్రేయస్సు కోసం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతి నెలా దాతల సహాయ సహకారాలతో పౌర్ణమి గరుడ సేవ నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఈవో వెంకటేశులు తెలిపారు. ఆలయంలో ఆదివారం అర్చకులు కోనేరాచార్యులు, చక్రధర్, మకరందబాబు, భానుప్రకాష్ భక్తుల నడుమ పౌర్ణమి గరుడసేను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి ఉత్సవమూర్నితి గరుడ వాహనంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దాతలు డాక్టర్ బలుషా వెంకట సుబ్బారావు, పోలా లక్ష్మయ్య అండ్ సన్స్ కుటుంబ సభ్యులను ఛైర్మన్ సత్కరించారు. అన్నమయ్య సేవా మండలి ద్వారా పౌరాల్ల పుల్లయ్య శిష్య బందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, భజన, గోదా రంగనాథ మహిళా మండలి వారి కోలాటం అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గంగభవానీకి భక్తిశ్రద్ధలతో జ్యోతులు

గాండ్లపెంట : స్థానిక గంగభవానీ ఆలయంలో ఆదివారం అమ్మవారికి మహిళలు జ్యోతులు బాణాలు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వేపరాల గ్రామం దళితవాడ నుంచి మహిళలు అమ్మవారికి జ్యోతులు బాణాలు తీసుకొచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా రావాలని రైతులు, ప్రజలు కోరుకున్నారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



గంగభవానీమాతకు జ్యోతులు తీసుకొస్తున్న మహిళలు

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: స్థానిక మారుతీనగర్‌లో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ బ్యాక్ లాగ్ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 7, 9 తరగతు(ఇంగ్లీష్ మీడియం)ల్లో కేటగిరీల వారీగా ప్రవేశపరీక్ష నిర్వహించి సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. 6వ తరగతికి ఎస్సీ-2, 7వ తరగతికి బిసి-డి 1 సీటు, 9వ తరగతికి బిసి-డి 1 సీటు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 5నుంచి 12వ తేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ప్రవేశ పరీక్ష 20వ తేదీ ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

జగన్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోంది

రొళ్ల : కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ పథకాలుగా చెప్పుకుంటూ జగన్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని జనసేన పార్టీ మండల కన్వీనర్ రంగస్వామి విమర్శించారు. ఆయన ఆదివారం రొళ్లలో మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకానికీ కేంద్రం నిధులు ఇస్తుండగా వైసీపీ ప్రభుత్వం వాటిని సొంత పథకాలు అని ప్రచారం చేసుకుంటుందన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు రోజుకు రూ. 272ను కేంద్రమే ఇస్తుందన్నారు. వాటన్నిటికీ జగన్ స్టిక్కర్లు వేసుకొని సొంత పథకాలంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు.

అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

బత్తలపల్లి : స్థానిక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేదపండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, కలశస్థాపన, కలశారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంకాలం ప్రదోషకాలపూజ, ధాన్యాధివాసం, గణపతి, నవగ్రహ హోమాలు, అమ్మవారి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు నరసింహులు, ప్రజలు పాల్గొన్నారు.

'వైసిపి బెదిరింపులకు భయపడం'

ప్రజాశక్తి-గోరంట్ల

వైసిపి నాయకుల బెదిరింపులకు భయపడమని మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప అనుచరులు పేర్కొన్నారు. స్థానిక చంద్రశేఖర్ థియేటర్‌లో ఆవివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బూదిలి కోటిలింగేశ్వరస్వామి ఆలయ భూమి కబ్జా, వైసిపి నాయకుల దౌర్జన్యాలపై నిమ్మల కిష్టప్ప రాజకీయ విమర్శలు చేయగా ఆయనపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నిమ్మల కిష్టప్పను విమర్శించే స్థాయి మండల వైసీపీ నాయకులకు లేదన్నారు. ఇకనైనా అసత్య ఆరోపణలు చేయడం మాని అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రఘునాథ్‌రెడ్డి, హంపయ్య, శ్రీనివాసులు, నారాయణస్వామి, శంకర, నరేష్, నాగరాజు, నరసింహులు, నిమ్మల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు



విలేకరులతో మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప అనుచరులు

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని మాజీ ఉపసర్పంచి మృతి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పులేరు మాజీ ఉప సర్పంచి సుధాకర్(50) ప్రమాదంలో మృతిచెందాడు. సుధాకర్ శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత బూదిలి రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న వాహనం నిలపకుండా వెళ్లిపోయింది. ఇంతలో సంఘటనా స్థలానికి చేరున్న స్థానికులు ద్విచక్రవాహనాల్లో ఆ వాహనాన్ని వెంబడించి నా ఫలితం లేకపోయింది. విషయం తెలిసిన వెంటనే గోరంట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నృత్య కళాకారులకు అవార్డులు

కదిరి అర్బన్ : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం అభిజ్ఞ నృత్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం "శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి నృత్య నీరాజనం" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 8 రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శన విజేతలకు 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్' కింద బహుమతులను ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాలకృష్ణ అందజేశారు. ముఖ్య అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ రైల్వే సభ్యులు గంగాధర్ హాజరవగా శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న గోపాలకృష్ణ

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

పుట్టపర్తి అర్బన్: గౌడ విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఉన్నత శిఖరాలకు ఎదగాలని వక్తలు సూచించారు. స్థానిక సాయి ఆరామంలో ఆదివారం తలమార్ల ప్రభాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హిందూపురం గౌడ సంఘం గౌరవాధ్యక్షులు రామకృష్ణప్ప, రొద్దం మాజీ జడ్‌పిటిసి చిన్నప్పయ్య, కౌన్సిలర్ సూర్యగౌడ్, ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు నాగేంద్రప్రసాద్, డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ మునెయ్య హాజరై ప్రసంగించారు. అనంతరం జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 75 మంది విద్యార్థులకు నగదుతో పాటు గౌడన్న విద్యాకిట్లను అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసిన సన్నప్ప రూ. లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, జక్కాల లక్ష్మి నరసింహగౌడ్, రమణగౌడ్, నాగభూషణం, రాజశేఖర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి పలువురు పరామర్శ

రొద్దం: మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన నారాయణమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకొన్న పలువురు నాయకులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారిలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి, ఏపిసీ మెంబర్ కెటీ శ్రీధర్, రొద్దం నరసింహులు, నరహరి, వెంకటరామిరెడ్డి, అశ్వర్థనారాయణ, జడ్పిటిసి అక్కులప్ప, నారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మండ్లి సర్పంచి కిష్టప్ప, గంగాధర్, అగ్రి ఛైర్మన్ కొండలరాయుడు, తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయ అభివృద్ధికి గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మలసాని చెంద్రాయుడుప్ప కుటుంబ సభ్యులు రూ. 51,116లను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆంజనేయ స్వామి ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు రామకృష్ణ, రాజశేఖర్, విజయభాస్కర్, కుండ్ల కృష్ణమూర్తిలకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు.

సంక్షేమపాలనకు నాలుగేళ్లు

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని పెనుకొండ నియోజకవర్గం వైసిపి నాయకు రాలు సానే ఉమారాణి పేర్కొన్నా రు. జగన్ పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మడకశిర రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా వై జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉమారాణి మీడియాతో మాట్లాడుతూ పెనుకొండలో వైసిపిని బలోపేతం చేస్తామన్నారు. జగన్ తనకు ఆదర్శమని, అనుమతి ఇస్తే పెనుకొండ నుంచి పోటీ చేయడానికి సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో వీరనారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, రామాంజి, దివాకర్‌రెడ్డి, సోమందేపల్లి వైస్ ఎంపిపి వెంకట్ నారాయణ రెడ్డి, గోపాల్ రెడి, నియోజక వర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న ఉమారాణి

ప్రమాద బాధితులకు 'గుండుమల' పరామర్శ

అమరాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామానికి చెందిన కుమార్, వీరనాగప్ప, తోపన్న, ముళ్లగిరిప్పలను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా కార్యదర్శి, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, కన్వీనర్ గణేష్, ప్రధాన కార్యదర్శి జయరామప్ప, మాజీ సర్పంచిలు పాండు, చంద్రప్ప, హనుమంతరాయ, మైనార్టీ నాయకుడు దాదాపీర్, పంచాయతీ కన్వీనర్ సురేష్, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జయరాం సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొని విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇక్కడ పలు రకాల పుస్తకాలు అందుబాటు లో ఉంటాయని వాటిని ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, ప్రసాద్, అటెండర్ మునీర్, పాఠకులు మహమ్మద్, రమేష్, రాఘవ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

రొద్దం : ఎమ్మెల్యే శంకరనారాయణ చొరవతో రొద్దం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయప్పగారి కొట్టాల నుంచి ఆర్.కుర్లపల్లికి వెళ్లే రోడ్డు మరమ్మతులను ఆదివారం చేపట్టారు. ఆ పనులను ఎంపిపి చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఇందులో భాగంగా రోడ్డుకి ఇరువైపులా పెరిగిన కంప చెట్లను జెసిబితో తొలగించి గ్రావెల్ రోడ్డు వేయనున్నట్లు ఎంపిపి తెలిపారు. నాగిరెడ్డిపల్లి వరకు బిటి రోడ్డు ఏర్పాటుపై ఎమ్మెల్యేకి విన్నవించగా స్పందించిన ఆయన వెంటనే మంజూ రు చేసి టెండర్లు పిలుస్తామని తెలిపారని ఎంపిపి వివరించారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే 4 గ్రామాల ప్రజలకి చాలా సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ఎంపిపి చంద్రశేఖర్